**కథానిక:**

# గంగవెర్రులు

శ్రీ టేకుమళ్ల కామేశ్వరరావు

"అమ్మాయీ! చెప్పినమాట చక్కగా విను! అదీగాక నీకే తెలుసుకదా! నీఅంతట నువ్వే చూస్తున్నావు కదా, ఎన్ని సంబంధాలు వచ్చి పోతున్నాయో! ఎల్లకాలం మనవెంట తిరుగుతారనుకొన్నావా! పెళ్లి సంబంధాలు కూడ ఒక ఋతువు లాంటివే! ఎన్ని సంబంధాలు వచ్చినా ఆ అదనప్పుడే వస్తాయి కాని అది దాటిపోయిందంటే 'బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా' అన్న సామెతే అనుకో! ఈ యౌవ్వనం, ఈ పొగరు ఇవి శాశ్వతం కాదు మనకి! కాస్త దూరంగా ఆలోచిస్తే గాని మనిషి బాగుపడడు" అన్నాడు వరాహగిరి తన కూతురితో.

వరాహగిరి బ్రాహ్మణుడై పుట్టి వ్యాపారంలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. అతను జవుళివ్యాపారం చేస్తాడు. జార్జిటౌన్ కాపురస్థలం. ముందుభాగం అంగడి, వెనుకభాగం కాపురముండే ఇల్లు. అతను చామంచాయగా ఉంటాడు. కుమార్తె పేరు సుకేశిని. ఆమె క్వీన్స్ మేరీ కాలేజీలో ఇంటర్ చదువుతూండేది. క్రమంగా చదువుమీద శ్రద్ధ సన్నగిల్లి, సంసార ప్రపంచ దృష్టి పెరగగా, చదువు మానిపించి సి తండ్రి, కుమార్తెయొక్క పెళ్లికోసం తొందర పడుతున్నాడు. ఆమె చిన్నప్పుడు స్ఫోటకం పడడంచేత కొంత అందవికారంగా కనబడుతుంది. ఆస్తిపరుడు కనుక డబ్బు పోసేస్తాడనుకోండి! అందచందాలు గావలసిన యువకుల పరీక్షకేమి ఆగుతుంది.

కాబట్టి ఆమె పెళ్లి తండ్రికొక సమస్య అయిపోయింది. ఆమె మట్టుకు తాను అందవికారంగా ఉన్నానని ఎప్పుడూ అనుకోలేదు. తన కంటికి అదొక లోపంగానే కనపడలేదు. "ఏముంది. ముఖంపౌడి మరొక పూత పూసి వేసేనంటే ఎవడితరం పట్టుకోడానికి!" అని అనుకొంటూంటుంది. తండ్రి అయినా అంత వ్రరిబాగులుగా పిల్లని ఎవరి ఎదుటా పెట్టడు! మునిమాపువేళ బార్‌లైట్ల వెలుగులో జిగేలు జిగేలు మనిపిస్తాడు. ఏదైనా గుడ్డలవ్యాపారస్తుడు చేయవలసిన పనికదా అది! కాని ఎంత చేసినా, సహజవికారం ఆఖరికేనా బట్టబయలు కాక మానదు.

వరాహగిరి చెప్పిన మాటలు సుకేశిని బాగా వింది. అతను వట్టి అజ్ఞాని, అని అతనిని గురించి ఆమెయొక్క భావముద్ర. ఆయనయొక్క ఇప్పటి పలుకులు ఆలకించగా ఆ భావం మరింత బలపడింది. కాని తండ్రిని ఎదిరించి జవాబు చెప్పలేదు. కనక "నేను ఎవరిని ఎంచేసేనేమిటి!" అని వట్టి అమాయకురాలిలాగు అంది.

"కిందటిసారి వచ్చిన కుర్రవాడిని నువ్వు వద్దనలేదమ్మా!" అన్నాడు తండ్రి కొంచెం గొంతుక బిగబట్టి.

"వాడు నా బుజాలదగ్గరకేనా రాడు. వాడి మొహం మండా! వాడికి పెళ్లేమిటి!" అంది.

"సరే! లోకంలో పొట్టి మొగుళ్లు, పొడుగు పెళ్ళాలు? పొట్టి పెళ్ళాలు పొడుగు మొగుళ్లు లేరంటావు? అదేనా నీ ఉద్దేశం? కాస్త చదువుకొన్నదానివి కదా! సరే! అయిపోయిందేదో అయిపోయింది! ఇప్పుడు దాని గొడవ ఎందుకు! ఆకిందటి సారి వచ్చిన యువకుడి మాట ఏమిటి?" అన్నాడు తండ్రి.

"వాడా! ఆ నల్ల యముడు! వాడి నెవరు పెళ్లాడుతారమ్మా, ప్రారబ్ధం కాకపోతే!" అని అసహ్యించుకొంది.

"సరే! అయితే వాడికిముందు వచ్చిన అతని సంగతో?"

"ఆ బోండంగాడా!" అని పకపక నవ్వింది.

"దేనికి దానికి ఏదో ఒక లొంపు ఎంచుతూ ఉంటావు! మా కాలంలో ఈ ఎంపుళ్లు గింపుళ్లు ఎరగం. పెద్దవాళ్లేవళ్లనో ఒకళ్లని చూసి ముడిపెట్టడం. అంతే! అయిపోయింది! ఈ కాలపు చిన్నవాళ్లతో వచ్చిన అల్లరే ఇది! వాళ్లకి తెలియదు; ఒకళ్లు చెప్పితే వినరు!"

తండ్రి మాటలు సుకేశిని జాగ్రత్తగా వింటూంది.

"ఇదంతా ఎందుకు చెప్పుతున్నానో తెలుసా? మరొక అబ్బాయి వచ్చి చూసుకొంటాడని నిన్న మా స్నేహితుడు ఒకతను వచ్చి చెప్పాడు. ఈమాటు వచ్చే సంబంధమేనా పాడుచేసుకోకని నేను ఉపదేశించడం. బహుశః ఆ కుర్రవాడు ఈ రోజే రావచ్చు. అందుచేత మనం సిద్ధంగా ఉండాలి" అన్నాడు.

"ఆయన పేరు?" అంది కూతురు ముసి ముసి నవ్వులతో.

"చంద్రశేఖర శాస్త్రి."

"మనిషి ఏలాగుంటాడో!"

"నేను చూసేనా, పెట్టేనా" అన్నాడు తండ్రి గట్టిగా.

సుకేశిని అలంకరణవిషయమై ఆదుర్దా పడుతూ వెళిపోయింది. వరాహగిరి వ్యాపార విషయమై అవతలకి వెళ్ళాడు.

ఆమె ప్రత్యేకంగా అలంకరించుకొంది. మూడు రంగుల దక్షిణాదిపట్టుచీర, చీరకి అనుగుణమైన పట్టు రవిక! మెడలో ఒక ముత్యాలహారం వేసుకొంది. వాసన నూనె, వాలుజడ. చదువుకొన్న యువతికనుక్త షోకు కళ్లజోడు ధరించింది. అనుక్షణం సంబంధ యువకుడికోసం ఎదురు చూస్తూనే ఉంది. ఇంటి ముందు ఏ మోటరు కారు ఆగినా కాబోయే పెళ్లికొడుకే అని తండ్రి ఆదుర్దా పడుతున్నాడు.

చంద్రశేఖర శాస్త్రి మంచి సంప్రదాయం గల కుటుంబంలోనివాడు. చెన్నపట్టణంలో నే చిన్న సొంత లోగిలి ఉంది. ఉపాధి కేమీ లోటు లేదు. తండ్రి వకీలుగా ఉండి కుటుంబానికి ఇంత ఆసరా చూపించి మరీ దేహయాత్ర చాలించాడు. ఆ అబ్బాయి కూడ చదువులో వృద్ధిగా ఉంటున్నాడు. ఇంజినీరింగు కాలేజీలో నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. జీవితం మూడు పువ్వులు, ఆరుకాయలుగా ఉండడాని కేమీ అభ్యంతరం లేదు. మనిషి సన్నగా ఎర్రగా ఉంటాడు. ముందు అంటకత్తిర, వెనక చిన్నపిలక. ఖద్దరు వస్త్రధారి; పంచ, షర్టు, కండువా వేసుకొంటాడు.

సంబంధం చూడడానికి వరాహగిరి గారి ఇంటికి వెళదామని శాస్త్రి పగలంతా తొందర పడుతున్నాడు. అదేమి ఖర్మమో కాని కుదరడం లేదు! ఏదో ఒక అడ్డంకి వస్తూనే ఉంది. సాయంత్రం వెళ్లక తప్పదు అనుకొన్నాడు. ఒక స్నేహితుడి కారుమీద వెళ్లడానికి ఏర్పాటు చేసుకొన్నాడు.

బయలు దేరడానికి తొందరపడుతూ వీధి గుమ్మం దగ్గరకి రాగా, ప్రబుద్ధారావు కనబడ్డాడు. శాస్త్రిని చూసి "హల్లో ఏమిటి! విశేషాలు?" అన్నాడు ప్రబుద్ధారావు.

అతన్ని శాస్త్రి ఆహ్వానించాడు. దారిని పోయేవాడు అడ్డు తిరిగి, గుమ్మం మెట్లు ఎక్కాడు. శాస్త్రి కుర్చీ చూపించగా దర్శకుడు కుర్చీమీద కూర్చుని "ఏమిటి ఈ పటాటోపం! ఎక్కడేనా ఫొటోకాని, లేకపోతే సినీమాకా, ఏమిటి కథ?" అన్నాడు.

"మరేం లేదు. చిన్న పనుంది. అంతే విశేషం" అన్నాడు శాస్త్రి, నవ్వు మొహంతో.

ప్రబుద్ధారావు శాస్త్రికి తోడి విద్యార్థి. ఇద్దరూ ఒకే తరగతి చదువుతున్నారు. కాబట్టి పరిచయం విస్తారం. కాని మనస్తత్వాలు భిన్నమవడంచేత స్నేహం ఏర్పడలేదు.

"చిన్న పనినిగురించి కొద్దిగా మేము కూడ తెలుసుకోవచ్చా?" అన్నాడు ప్రబుద్ధారావు.

"నిరభ్యంతరంగా. పెళ్లి చూపులకి" అన్నాడు చిరునవ్వు ఆపుకొంటూ.

"ఇంకేం! కొట్టూ! ఢావు! ఇంకా చెప్పావు కాదు! ఎవరు? ఏమిటి సంగతి?"

"ఒక వ్యాపారస్తుని కుమార్తె. నాకూ అంతగా విశేషాలు తెలియవు. చదువుకొంది. చూడడానికి రమ్మని కబురు పంపారు" అన్నాడు శాస్త్రి.

"కారు మీదేనా వెళ్లిరావడం?"

"కాకపోతే!"

"దర్జా కనబరచకపోతే ఎట్లాగయ్యా! అయితే నేనుకూడ వెంట రావచ్చా, యువరాజుగారి వెంట యువమంత్రి అన్నట్టుగా!"

"దానికేముంది. ఇదేం మూతి వేస్తే ముక్కిపోయేదా, ఏమేనా? ఇద్దరం వెళ్ళి చూసివద్దాం, రా మంచో చెడ్డో కనుక్కొందాం. ఒక తలకాయకంటె రెండు తలకాయలు మెరుగని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి" అన్నాడు శాస్త్రి.

"అయితే వేషం మార్చవద్దూ! ఈ చప్రాసీగుడ్డలతో నేనా!"

"ఊఁ. కానీ!"


"వెళ్లి, ఇక్కడ ఉన్నట్టుగా వస్తాను" అని ప్రబుద్ధారావు వీధిలోకి ఒక్క గంతు వేశాడు. శాస్త్రి కారు కోసం ఎదురు చూస్తున్నాడు. ప్రబుద్ధారావు సైకిల్ మీద ఇట్టే కొట్టుకు వచ్చాడు. అతను గులాబీ రంగు సూట్ వేసుకొన్నాడు. నెక్ టై, కాలరు, కళ్లజోడు. తలకి వాసన నూనె రాశాడు. చేతిరుమ్మాలుకి అత్తరువు పూశాడు. కోట్ కికూడ కాస్తపట్టించాడు. కాళ్ళని నిగనిగలాడే నల్లని బూట్లు. అప్పుడేస్టీమరు



దిగివచ్చిన దొరగారిలా గున్నాడు. అతను సైకిల్ మీద రాగా అతని వెంట బొచ్చు కుక్క కూడ పరుగెత్తుకు వచ్చింది. శాస్త్రి కుక్కని ఈల వేసి పిలిచాడు. ఇంతటిలో కారు వచ్చింది. స్నేహితులిద్దరు కారు మీద కూర్చున్నారు. కుక్క కూడా కారు ఎక్కింది.

ఇంటిఎదుట కారు నిలిచి హారన్ కొట్టగా వరాహగిరి ఇతలకి వచ్చి, స్నేహితులకిద్దరికి స్వాగతమిచ్చి, లోపలకి తీసుకొనివెళ్లి, కుషన్ కుర్చీలమీద కూర్చోబెట్టాడు. ఎవరెవరో పైనం కనుక్కున్నాడు. సంబంధయువకుడైన శాస్త్రితో సంభాషిస్తున్నాడు. బార్ లైట్లు వెలుగుతున్నాయి. నేలమీద రత్నకంబళి పరిచిఉంది. మధ్య ప్రశస్తమైన చెక్కడపు పనిగల మేజాబల్ల ఉంది. చుట్టూ సోఫాలు, కుషన్ కుర్చీలు ఉన్నాయి. గోడలని నాజూకైన పెద్ద పటాలు, రెండు పెద్ద అద్దాలు ఉన్నాయి. ఇంతటిలో ఫలహారం, కాఫీ వచ్చాయి. స్నేహితులు రుచిచూశారు. సుకేశిని అలంకృతయై దివ్యమంగళవిగ్రహంలాగు వచ్చి ఒక సోఫామీద కూర్చుంది. ఆమెకి ఫలానా ఫలానా అని స్నేహితులిద్దరిని తండ్రి పరిచయం చేశాడు. "కుక్క ఎవరిది?" అని ఆమె ప్రశ్నించగా, "సంబంధ యువకుడితో వచ్చిన స్నేహితుడిది" అని తండ్రి చెప్పాడు. సుకేశిని కుక్కని చూసి ముచ్చటపడి, దానికి రొట్టె తెప్పించి వేసింది. సంబంధయువకుడితో వచ్చిన అతని స్నేహితుడి వేషమూ, అతని వేళాకోళాలూ, అతని భాష చూసి దిగ్భ్రమ చెందింది. ఒళ్లంతా కళ్లు చేసుకొని అతనినే చూస్తూంది. చదువుకొన్న స్త్రీ అయినా కూడ ఆమె సంభాషణలోకి దిగలేదు. ప్రబుద్ధారావు యువరాజులాగు, శాస్త్రి పురోహితుడిలాగు ఆమె కళ్లకి కనబడ్డారు. కొంతసేపు కూర్చుని ఆ అమ్మాయి వెళ్లిపోయింది. మరి కొంతసేపు కూర్చుని మాట్లాడి, స్నేహితులిద్దరూ లేచి వెళ్లి వస్తా

మని చెప్పి, వెళ్లేముందు శాస్త్రి వరాహగిరితో "ఆతర్వాత కబురు పంపిస్తాను లెండి" అన్నాడు. ఆయన సంతోషం ప్రకటించాడు. వాళ్లు వెళ్లిపోయేటప్పుడు సుకేశిని తలుపుసందులోంచి ప్రబుద్ధారావుని. మరొకసారి చూచి సంతోషించింది.



కారులో వెళ్లుతూన్నప్పుడు దారిలో ప్రబుద్ధారావు "పెళ్లికూతురు ఏలాగుందయ్యా?" అన్నాడు.

"సంసార పక్షం. మేక్అప్ జాస్తిగా ఉంది. ఏదో చూశాం, కాఫీతాగి, లేచి వచ్చాం, అయిపోయింది" అన్నాడు.

శాస్త్రిని ఇంటిదగ్గిర దిగబెట్టి ఆ కారు ప్రబుద్ధారావుని అతని గదిదగ్గిర దిగబెట్టింది.

సుకేశిని ఆ యువకు లిద్దరి వైనం తండ్రి నడిగి చక్కగా తెలుసుకొంది. ఆమె శాస్త్రిని మెచ్చుకోనందుకు వరాహగిరి చాల విచారించి "ఏమిటి కారణం అమ్మాయీ?" అని నిస్పృహతో అడిగాడు.

"పంచాంగంకట్ట బ్రాహ్మడిలాగున్నాడు నాన్నా!" అంది కుమార్తె.

"శివ! శివ! మన సంప్రదాయమమ్మ అది. వాళ్లు భాగ్యవంతులు. అంతేకాని యాచకులు గారు. అతను చదువుకొన్నవాడు" అని ఇంకా ఏదో చెప్పబోతూండగా ఆమె పెడమొహం పెట్టింది. అతను చేసేదేమీ లేక మనస్సులోనే అవస్థపడ్డాడు.

సుకేశినిమనస్సు ప్రబుద్ధారావుమీద లగ్నమయింది. ఆమె కెంతసేపూ అతని మూర్తే కళ్లకి కట్టినట్లు కనబడుతూంది, అతని కేరింతాలు, నవ్వులు, హావభావాలు మళ్లీమళ్లీ జ్ఞాపకానికి తెచ్చుకొని పరవశురాలవుతూంది. అతనికి తన ప్రేమని తెలియజేసే విధాన మేమిటని ఆలోచిస్తూంది. ఆలోచించి, చివరికి తమ బట్టలకొట్టుమీద పనిచేసే కుర్రవాళ్లని అడిగి చూసింది. వారిలో కొత్తగా వచ్చిన ఒకడు కొంత నేర్పరిగా కనబడ్డాడు. వాడికి కొన్ని సంగతులు చెప్పింది. శాస్త్రి ప్రబుద్ధారావుల ఇళ్ల వైనం తెలియజేసి తాను తయారుచేసిన ప్రేమలేఖ వాడి చేతికి ఇచ్చి, ప్రబుద్ధారావుకి ఇచ్చిరమ్మంది. "సరే!" అని ఆమె ఇచ్చిన డబ్బులు జేబులో వేసుకొని, వాడు ఆ ఇళ్లకోసం వెతకడం మొదలుపెట్టాడు. శాస్త్రిఇల్లు తెలిసింది కాని ప్రబుద్ధారావు ఇల్లు తెలియలేదు. అందుచేత వాడు తిరిగి శాస్త్రి ఇంటికి వెళ్లి ప్రబుద్ధారావుగారి ఇల్లెక్కడ?" అని ప్రశ్నించాడు.

ఆ కుర్రవాడెవరో తెలియక "ఎవరు నువ్వు?" అని శాస్త్రి ప్రశ్నించాడు.

"జవుళి అంగడిలో పనిచేస్తున్నాను."

"ఎవరి అంగడి?"

"వరాహగిరిఅయ్యవారి అంగడి."

శాస్త్రి ఆశ్చర్యపోయాడు. ఉంటే నాతో పని ఉండాలి కాని ప్రబుద్ధారావుతో పనేమిటి అని ఆలోచించి "నీకు ప్రబుద్ధారావు ఎందుకు?" అన్నాడు.

కుర్రవాడు నవ్వివేసి, చేతిగుమ్మాలు పళ్లతో పట్టుకొన్నాడు.

శాస్త్రికి చిత్రమయింది. ఏదో విశేషముందనుకొన్నాడు. "సంగతి ఏమిటి?" అన్నాడు.

"కుర్రవాడు "ఏమీ కాదండి" అనగా, శాస్త్రి జేబులోంచి ఒక రూపాయి తీసి ఇచ్చి "ఏమిటి సంగతులు" అని ప్రశ్నించాడు.

కుర్రవాడు "ఆ అమ్మాయిగారు జాబు ఇచ్చారండి" అంటూ అతని చేతికి లేఖ అందించాడు

ఆ లేఖ తీసికొని చూడగా దానిమీద తనస్నేహితుడి చిరునామా ఉంది. అతని కేమీ తోచలేదు. కుతూహలం ఎక్కువ అయింది. "ఇప్పుడే వస్తా" నని చెప్పి, ఇంటిలోకి వెళ్లి, ఉత్తరం చింపి, చదవగా, సుకేశిని ప్రబుద్ధారావుకు రాసిన ప్రేమలేఖ! అదంతా పూర్తిగా చదువుకొని ఆశ్చర్యపోయాడు. ఇవతలినుంచి పనివాడు కేకలు పెట్టగా, మరొక కవరుమీద చిరునామా వ్రాసి, లేఖ అందులో పెట్టి, అతికించి,

సంచీ వాడిచేతికి ఇచ్చివేస్తూ, "ఆవిడ వ్రాసిన ప్రతి ఉత్తరం నాకు తీసుకొని వచ్చియియ్యి. నీకు మంచి బహుమానమిస్తా!" నని చెప్పి, మరొక రూపాయి వాడి చేతిలో పెట్టగా, పనివాడి మొహం చేటంతయింది. ప్రబుద్ధారావు ఒక్కడే ఫలానావీధిలో ఫలానాగదిలో ఉంటున్నాడని అతను చెప్పగా, వాడు ఆ ఉత్తరం తీసుకుపోయి అతనికి ఇచ్చివేశాడు.

తనని తూలనాడుతూ, ప్రబుద్ధారావుని మెచ్చుకొంటూ సుకేశిని రాసిన ఉత్తరాన్ని చదువుకొని, శాస్త్రి మొదట చాలా ఖిన్నుడైపోయాడు. తర్వాత ఉగ్రుడైపోయాడు. "ప్రబుద్ధారావుపాటివాణ్ణి కాకపోయేనా నేను, దీని దృష్టిలో! అతనికున్నపాటి అందము, తెలివితేటలు, చమత్కారము నాకు లేకపోయేయిట! అందుచేతట వాడిని వలచడం! ఏమిటి దీని రాతలు! నాకంటే నిజంగా వాడు ఏమి అందగాడని? నేను ఎర్రగా ఉంటేగా వాడు చామంచాయగా ఉన్నాడే! వాడికంటె చదువులో నేను సహస్రవిధాల మెరుగన్న విషయం దానికేమి తెలుస్తుంది, మా మార్కులు చూసినవాళ్లకి తెలుస్తుంది కాని! ఊరికే నాలుక బుజాన్ని వేసుకు తిరగడం, ఇక్కడా అక్కడా చెప్పుదెబ్బలు తిని లేచి రావడం, ఇదే వాడికున్న చమత్కారాలు. ఇదంతా దానికేమి తెలుస్తుంది! అసలు సుగుణాలు ఎరగకపోతే ఇలాగే ఏడుస్తుంది! దానికి నామీద ఉన్న దురభిప్రాయం మార్చాలి. వాడికన్న నేను అనేకవిధాల మెరుగన్న విషయం దానికి రుజువుపరిచితీరతాను. నేను ఊరుకోను. పోనీకదా అని నేను వాడిని-వీధిలో తిరుగుతూన్న వాడిని - ఉట్టినే కారుమీద కూర్చోపెట్టి ఒకమారు తిప్పి తీసుకొని వచ్చినదాని ఫలితమా ఇది! ఇదా నా గుణవర్ణన! ఛీ! ఛీ! వాడి దుష్టలక్షణాలన్నీ బైటపెట్టితీరతాను. నేనేమంత చేతకానివాణ్ణి అనుకుంది కాబోలు! నా మజా చూపిస్తా! నావెంట బొచ్చుకుక్కని తిప్పినట్టు తిప్పిస్తా! అప్పుడుకాని దానికి తెలియదు నా గొప్పతనం!" అని ప్రజ్ఞలు పలికాడు. అతను ప్రబుద్ధారావుని తలుచుకోగా ఎంతో రోత అనిపించింది. పట్టలేనంత ఈర్ష్య అనిపించింది.

రహస్య ఉత్తర ప్రత్యుత్తరాలు సుకేశిని ప్రబుద్ధారావుల మధ్య జరుగుతున్నాయి. అసలే ప్రబుద్ధారావు చదువు ఓటుగా ఉండగా ఇప్పుడు చదువు సంధ్యలు బొత్తిగా సన్నగిల్లాయి. ఊరువెంట బలాదూరు తిరుగుతున్నాడు. దూరదూరంనుంచి సుకేశిని నీడ చూసి ఆనందిస్తున్నాడు. దారిలో రెండుమూడుసార్లు ప్రబుద్ధారావుకి శాస్త్రి ఎదురయాడు. కాని అతను పలకరించలేదు. పైగా పళ్లు ఇగిలిస్తూ వెళ్లిపోయాడు. అతన్ని చూసి శాస్త్రి ఆగినా, అతను ఖాతరు చెయ్యకుండా సాగిపోయాడు. దీనితో శాస్త్రి అనుమానాలు మరింత బలపడ్డాయి. "వీడి ఎగురుపాటు వదులుస్తా" అనుకొన్నాడు.

శాస్త్రి ఒకటి రెండుసార్లు వరాహగిరిగారింటికి తనకి తానై వెళ్లాడు. కాని ఆయన ఇంటిలో లేకపోయాడు. శాస్త్రి వచ్చి వెళ్లినట్లు ఆయన తెలుసుకొన్నాడు. కాని తనకుమాత్ర అతనిని ఒప్పుకోలేదు కదా అని ఆ ప్రశంస అంతగా పెట్టుకోలేదు. సుకేశినివర్తన వెనుకటిలాగు లేదని తండ్రి అనుమానించాడు కాని అతనికి అంతుపట్టలేదు.

శాస్త్రి చాల తహతహలాడుతున్నాడు. ఇదివరకు ఆమెనిగురించి అతనికి ఉన్న అభిప్రాయం ఇప్పుడు మారిపోయింది. పైగా సుకేశిని తనకి అంగుబాటులో ఉన్నట్లు కనపడలేదు. ఆమెరహస్యపుటుత్తరాలు ఒక్కటొక్కటే చదివి చూస్తున్నాడు. తననితూలనాడుతూ, ప్రబుద్ధారావుని ప్రశంసిస్తూ ఉండగా అతను విచారిస్తున్నాడు. ఆమెప్రేమకి తాను పాత్రుడు కాకపోయినందుకు పరితాపపడుతున్నాడు. అతనికి దారి, తెన్ను తోచడంలేదు. "పోనీ, ఆమె నన్ను చేసుకోకపోతే మానె! ఆ పుండాకోరుని వలవడమేమిటి, నా మొహం కాకపోతే! వాడికేమైనా నీతా, నిష్ఠా! మిలిటరీహోటళ్లకి పోయి మాంసం తింటాడనీ, రహస్యంగా తాగి తందనాలు తొక్కుతాడనీ దానికేం తెలుసు! ఈలాంటి దుష్టచేష్టలవల్లే కదా వాడికీ నాకూకూడా అసలు దోస్తీ ఏర్పడకపోవడం! వాడికి తప్పిపోవడం, నాకు కావడం ఉత్తమమే! కాని అది కాకపోయినా, ఆ తాగుమోతుచేతులలో అది పడి నాశనం కాకుండా ఉంటే సరి! అదే నేను కోరేదల్లా! వాడిచేతులలో పడడం ఎలాంటిదంటే, పిల్లిపాదాల మధ్య ఎలుక పడడం లాంటిది!"అని మననంచేసి, విచారించాడు. అతను తటాలున లేచి మేజాబల్ల దగ్గరకి వెళ్ళాడు. ఒక కాగితం తీశాడు. దానిమీద రెండే ముక్కలు రాశాడు. "నేను మీ దర్శనానికి ఇదివరలో మూడుసార్లు వచ్చాను. కాని కాలేదు. కారణం తెలియదు. తిరుగు టపాలో జవాబు వ్రాయ కోరుతున్నాను" అని లేఖ వ్రాసి, సంచీలో పెట్టి, వరాహగిరి యొక్క చిరునామా వ్రాసి, వెళ్లి, పోస్టులో పడవేశాడు.

అతను పోస్టాఫీసునుంచి తిరిగి ఇంటికి వచ్చేసరికి, ఇంటిదగ్గర తనకోసమని వరాహగిరితాలూకు పనికుర్రవాడు కనిపెట్టుకొని ఉన్నాడు. వాడిని చూసి శాస్త్రి ఆశ్చర్యపోయి, ఆతురతతో "ఏమిటి విశేషాలు?" అని అడిగాడు. వాడు ఒక లేఖ అతనికి అందించాడు. లోపలికి వెళ్లి ఆ లేఖ విప్పి చదువుకొని, తిరిగి ఒక కొత్త కవరులో పెట్టి, పనివాడి చేతికి అందించి "ఇదిగో! నీ బహుమానం!" అంటూ రెండు రూపాయలు చేతిలో పెట్టాడు. కుర్రవాడు తన దారిని తాను చక్కాపోయాడు.

శాస్త్రి అపరిమితంగా సంతోషపడ్డాడు. ఆ లేఖ చాలా ముఖ్యమైనది. సంతోషంలోనే విచారం పొందుతున్నాడు. ఆ లేఖలో సుకేశినీ ప్రబుద్ధా



రావులు ఏర్పాటు చేసుకొన్న రహస్య సమావేశం, తదుపరి లేచిపోవడం ఇంకా మరికొన్ని ఏర్పాట్లు వివరంగా ఉన్నాయి. వాటిని తలుచుకొని శాస్త్రి ఎంతో విచారించాడు. ఆ లేఖలో అంశాలు అనగా, తేదీ, స్థలం, వేళ మొదలైనవి చక్కగా గుర్తుపెట్టుకొన్నాడు. "ఆ నాటికి నేను ఆ స్థలానికి వెళ్లి దానిని కాపాడాలి. ఈ లోపలే వాడినిగురించి ప్రొహిబిషన్ సిబ్బందికి తెలియజెయ్యాలి" అని నిర్ణయించుకొన్నాడు.

ప్రబుద్ధారావు కాలేజీలో ఇంటర్ చదివేటప్పుడు అతనికొక ఇంగ్లీషు ప్రొఫెసర్ ఉండేవాడు. ఆ ప్రొఫెసరుకి కొందరు ప్రియశిష్యులు ఉండేవారు. వాళ్లలో ప్రబుద్ధారావు ఒకడు. ఆ ప్రొఫెసరు శిష్యులకి నేర్పిన చదువేమీ లేదు. బంగాళాలో తాగి తందనాలు తొక్కుతూంటే, శిష్యులు చుట్టూచేరి భజన చేసేవారు. క్రమంగా వాళ్లుకూడా తాగడం మొదలపెట్టారు. మాంసాహారాభ్యాసం చక్కగా అయింది. ఆ ప్రొఫెసర్ కొన్నాళ్లకి తన దేశం వెళ్ళిపోయాడు. కాని, శిష్యవర్గం మాత్రం అతని అడుగుజాడలలో నడుస్తున్నారు. ఈమోస్తరుగా ప్రబుద్ధారావు చాటుగా మాటుగా తాగి అవస్థలు పడుతూంటాడు. ఈలాగు కాలక్షేపం చేస్తున్నాడు.

శాస్త్రి వ్రాసిన ఉత్తరం వరాహగిరి చూసుకొన్నాడు. తన కుమార్తెకి వచ్చిన సంబంధా లన్నిటిలోను ఇదే ఉత్తమమని అతను బాగా ఎరుగును, కాని, విద్యావతియైన తన కుమార్తెకి నచ్చజెప్పడ మెలాగు! అతను ఆలోచించి కుమార్తెను నిర్బంధపరిచి అతని కిచ్చి పెళ్ళిచెయ్య నిశ్చయించుకొన్నాడు. సుకేశిని ఎదుటకి రాగా "అమ్మాయీ! శాస్త్రిగారు వ్రాసిన ఉత్తరం చూడనే చూశావు కదా!" అన్నాడు.

"ఎరుగుదును" అని ఆమె మొహం చిట్లించుకొంది.

"ఇన్నాళ్లించీ ఎంత ప్రయత్నం చేస్తూన్నా మళ్ళీ ఏ సంబంధమూ రాలేదు. నీవే చూస్తున్నావు కదా!" అనాడు.

ఆమె మనస్సులో ప్రబుద్ధారావు ప్రతిబింబించాడు.

"ఎదిగిన పిల్లని ఎంతకాలం ఇంటలో ఉంచుకోను! బంధువులకి, స్నేహితులకి కూడ విపరీతంగా కనపడతుంది" అని తన బాధ తెలుపుడు చేసుకొన్నాడు.

"ఏమి, ఉంటే ఉంటుంది? వాళ్లేమి ఆర్చేవాళ్లా, తీర్చేవాళ్ళా?" అని కుమార్తె పెద్దమాట లాడింది.

"అలాగు ప్రతిదీ తీసిపారెయ్యడానికి లేదు. జీవితమంటే పదిమందితో సంబంధించిన పని, ఎవ్వరినీ కాదని మనం ఒక్కళ్లం బతకలేము" అని అనుభవ పూర్వకంగా మాట్లాడాడు.

'నా బతుకు నేను చూసుకొంటాను' అని ఆమె మనసులో అనుకొంది.

"ఇంతకీ నేను చెప్పవచ్చే దేమిటంటే, శాస్త్రిగారి సంబంధం మనం విడిచి పెట్టుకోవద్దు. అది మన కాళ్లదగ్గరకి వచ్చిన సంబంధం! చదువుకొన్నదానివి కనక "సిరి రా మోకాలొడ్డునె" అన్న సామెత జ్ఞప్తికి తెచ్చుకో! బాగా ఆలోచించుకో! లోతుగా ఆలోచించి చూడగా మనం తల్లకిందులు పడి తపస్సుచేసినా మళ్ళా అటువంటి సంబంధం మరొకటి తేగలమని తోచదు. మనం తేలేము అనికూడ నాగట్టి నమ్మకం! ఇది ముమ్మాటికీ నిజం! ఏమంటావు?" అని మాటవరసకి ప్రశ్నించాడు.

ఆమె మనస్సులో నా ప్రారబ్ద మెలా కాలిపోయిందో ఏమిటో!" అనుకొంది; నేలవైపు చూస్తూంది.

"అతనికి నేను మళ్లీ వచ్చి మాట్లాడవలసిందంటూ వుత్తరం రాస్తున్నాను. వింటున్నావా?" అని హెచ్చరించాడు.

నువ్వు రాసుకుంటే రాసుకో, నాకేం అన్నట్లుగా ఊరుకుంది.

మౌనం అర్ధాంగీకారం అని భావించి అతను శాస్త్రికి ఉత్తరం రాశాడు.

ప్రబుద్ధారావుతో జరగబోయే సమావేశాన్ని తలుచుకొంటూ సుకేశిని ఉవ్విళ్లూరుతూంది. ప్రబుద్ధారావుని కలుసుకొన్న వెంటనే ఆమె అతని చేతులలో వెలికిల సినిమాస్టారులాగ పడిపోవాలనీ, ఇంకా రెండు మూడు ఫోజులు అభినయించి ఆనందప్రవాహంలో ఓలలాడాలనీ ఆమె కలలు కంటూంది. సమావేశం అడ్డంకులు లేకుండా తటస్థించడంకోసం ఆమె దేవుడిగుళ్లో పది కొబ్బరికాయలు కొట్టింది.

ఈ రోజు సాయంకాలం ఆరుగంటలకే సమావేశం ఏర్పాటు. సుకేశిని ఎర్రని పట్టురవిక, నీలిపట్టుచీర ధరించి నడుస్తూ సూర్యుని నీరెండిలో నృత్యంచేస్తూన్న నెమలిలాగు ఉంది. తీయని ఆలోచనలు ముసురుతూండగా ఆమె నడివీధిలో నడవడానికి సిగ్గుపడింది. దారిపక్కని నడుస్తూ సైడుకాలవలో రెండుసార్లు పడడానికి సిద్ధమయింది. తన సాహసాన్ని తలుచుకొని పరమాశ్చర్యపోయి జంకుతూంది. ఆమె చెప్పిన మర్రిచెట్టుదగ్గిరే ప్రబుద్ధారావు నిలుచుని ఎదురుచూస్తుండగా, ఆమె కోరిక మేఘమండల మెక్కి కిందికి చూసింది. ఆమెకోసం వెయ్యికళ్లతో చూస్తున్నాడు అతను. అతనిదగ్గిర కుక్కకూడా నిలబడ్డది.

శాస్త్రి తెలియబరిచిన ఆచోకీ తీసుకొని ప్రొహిబిషన్ పోలీసులు ప్రబుద్ధారావు గదికి వెళ్లి, సోదా చేయగా రెండు ఖాళీబుడ్లు, సారాయి సగం ఉన్న మరొకబుడ్డి దొరికాయి. వాళ్లు మనిషికోసమని వెతుకుతున్నారు.

మర్రిచెట్టుదగ్గిరికి సుకేశిని వచ్చింది. ప్రబుద్ధారావుని చూసి సిగ్గుపడి తలవంచుకొని నిలుచుంది. ప్రబుద్ధారావు 'ప్రియురాలా!' అంటూ చేతులు చాచాడు, ఇంతటిలో శాస్త్రి అక్కడికి చేరాడు. ప్రబుద్ధారావుని చూసి చూడగానే అతనికి రోషంపుట్టింది. వేరే ఆలోచన లేకుండా బొచ్చుకుక్కలాగు మీద పడిపోయాడు; ఊచి పుచ్చుకొని ఒక్క లెంపకాయ వేశాడు. అతను తాగిన


ఆంధ్రపత్రిక

శ్రీ ఖరనామసంవత్సర

పంచాంగం

బ్రహ్మశ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రి సిద్ధాంతిగారిచే గుణించబడిన

ఈ సంవత్సరం పంచాంగంలో చాంద్రమాన, దృక్సిద్ధాంతాల ప్రకారం గుణింపబడిన రెండుపద్ధతుల తిథి, నక్షత్రాదులు వేర్వేరుగా చూపబడినవి.

కొత్తపంచాంగాలు సిద్ధమైనవి

| | | |
|---|---|---|
| 100 పుటలు వెల ప్రతి | 1-కి | 0-4-0 |
| ,, | 100-కి | 16-0-0 |
| ,, | 1000-కి | 150-0-0 |

రైలు ఖర్చులు ప్రత్యేకం.

1000 కాపీలు ఒకేసారి కొనువారి చిరునామా ముఖపత్రమున ముద్రించబడును.

వివరాలకు వ్రాయండి:

మేనేజరు
ఆంధ్రపత్రిక, మద్రాసు-1.

కంపు కొటగా శాస్త్రికి ధైర్యం ఇనుమడించింది. 'తాగినవాణ్ణి కిందికి తోసివెయ్యడ మెంతసేపు' అనుకొన్నాడు. బుద్ధారావు రౌద్రాకారం దాల్చాడు. శాస్త్రి మెడకిచుట్టుకొన్న కండువా చేతికి దొరకగా ముందుకు లాగాడు; పిలక పట్టుకోబోయాడు, కాని దొరకలేదు. శాస్త్రి ప్రబుద్ధారావు ముందుపింఛం పట్టుకొని కిందికి లాగి వీపుమీదరెండు గుద్దులుగుద్దాడు. కిందికి తోసివేశాడు. ప్రబుద్ధారావు అప్పుడే దర్జీవాడి కొట్టుదగ్గరనుంచి తెచ్చుకున్న కొత్త తెల్లని సూటు మట్టిపాలుకాగా, కోపం రెట్టింపయింది. శాస్త్రియొక్క కాళ్లు పట్టుకొని కిందికి లాగేశాడు. వాళ్ళజగడం చూసి అర్థంకాక సుకేశిని నివ్వెరపోయింది. ఆమెకు అదేదో సినీమా చూసినట్లుగా కనపడింది. వాళ్లిద్దరూ ఒకళ్లమీద ఒకళ్లు పడి కుక్కలలాగు కొట్లాడుకొంటున్నారు. ఇహాలాభం లేదని సుకేశిని మొత్తుకొంటూంది. బొచ్చుకుక్క ఇటూ అటూ పరుగెత్తి మొరుగుతూంది. అంతేగాని కరవదు. వెనక రొట్టిముక్కలు తిన్న విశ్వాసంవల్ల శాస్త్రిని ఏమీ చెయ్యడంలేదు. ఏదైనా మొత్తంమీద ప్రబుద్ధారావు బలశాలి అవడంవల్ల శాస్త్రి విధిలేక వెనకంజ వెయ్యవలసివచ్చింది. ఇంతటిలో ప్రబుద్ధారావు కోసం వెతుకుతూన్న ప్రొహిబిషన్ పోలీసులు వచ్చారు. అతన్ని పట్టివేశారు. తగవులాటతో ప్రబుద్ధారావు అసహ్యంగా ఉన్నాడు. పోలీసులు అతన్ని వెంటపెట్టుకొని తీసుకుపోయారు.

ప్రబుద్ధారావు పట్టి తాగుబోతని తెలిసి సుకేశిని ఆశ్చర్యపోయింది. తనకి ప్రాణాపాయం తప్పినట్లుగా సంతోషించింది. "ఎరుగక గోతిలో పడేదాన్ని అయినా భగవంతుడు నన్ను దయతో కాపాడాడు. నాకు బుద్ధివచ్చింది" అనుకొంటూ, ఇంటిదారి పట్టింది.

శాస్త్రి వరాహగిరిగారి ఇంటికి వెళ్లాడు. ఆయనను కలుసుకొని జరిగిన కథంతా ఏకరువు పెట్టాడు. తాను సుకేశినిని ప్రబుద్ధారావుబారినుండి ఏలాగు కాపాడినదీ, ప్రొహిబిషన్‌పోలీసులకి అతన్ని ఎలాగు అప్పజెప్పినదీ, వర్ణించగా వరాహగిరి 'ఇంతకథ జరిగిందా!' అంటూ విస్తుపోయాడు. అతను తెప్పరిలి "నేను మీకు వ్రాసిన లేఖ అందిందా?" అన్నాడు.

"లేఖ ఏమిటి?" అని శాస్త్రి ఆశ్చర్యపోయాడు.

ఇంతటిలో వరాహగిరిపనివాళ్లుకూడా ప్రబుద్ధారావుని ఖైదుచేసినట్లుగా చెప్పారు. వరాహగిరి తన బిడ్డకి గొప్పగండం తప్పిందని చాలా సంతోషించాడు. అతని కృతజ్ఞతకి మేర లేకపోయింది. ఇంటిలో నున్న సుకేశినిని పిలిచాడు. ఆమె వచ్చి నేరస్తురాలిలాగ నిలబడింది. "నీవు చేసిన ద్రోహానికి నీకు ఎటువంటి శిక్షకూడ తక్కువే! ఈ మహానుభావుడే నిన్ను, నన్నుకూడా కాపాడాడు. లేకుంటే నీవు అడవులపాలయిపోయుందువు; నేను అపకీర్తిపాలయిపోయుండేవాణ్ణి. ఇతనికంటెనీకు వేరే దేవుడు లేడు!" అని అనగా, సుకేశిని కృతజ్ఞతాభావంతో శాస్త్రివైపు చూసింది.

"నవ్వ ఎప్పుడో బంగారు పువ్వులతో పూజచెయ్యడంబట్టే నీ కిటువంటి సద్గుణవంతుణ్ణి భర్తగా భగవంతుడు ఏర్పాటు చేశాడు" అన్నాడు తండ్రి.

ఆమె రెప్పలలోంచి ఆనందం తొంగి చూసింది.

వరాహగిరి సుకేశిని చెయ్యి, శాస్త్రి చేతిలోపెట్టి "ఇదే మీకు ప్రధానం" అని ఉచ్చరించగా, శాస్త్రి శరీరంలో ఆనందవాహిని ప్రవహించింది. సుకేశినితల సిగ్గుతో పక్కకి వంగిపోయింది. ★



పెద్దమనిషి: రాత్రి కాపలావాడు కావాలని మీరు పత్రికలో వేసిన. ఫలితం ఏమన్నా కలిగిందా?

బాంకు మేనేజరు: కలగకేం? ఆ రాత్రే మా బాంకులో దొంగలు పడ్డారు.

ఈ ఏడాది డిసెంబరులోగా మరొక లక్షమందిని వియట్‌నామ్‌సైన్యంలోకి చేర్చుకుంటారు...అమెరికా ఈ సైన్యానికి ఆయుధాలు సరఫరా చేస్తుందట. ఈ అదనపు ఆయుధాలకయ్యే ఖర్చు, వియట్‌నామ్‌సాలీనా ఆదాయానికి సరిపోతుంది. (4 కోట్లపౌనులపైచిలుకు)......వియట్‌నామ్‌లోని ఫ్రెంచిసైన్యాలనిమిత్తం ఫ్రాన్సు ఏటేటా 16 కోట్లపౌన్లదాకా ఖర్చుపెడుతోంది. —లండన్ "టైమ్సు"